

‘నిజమే, నీ ప్రేమను
తిరస్కరించాల్సింది కాదు.
ఐ లవ్ యూ..
లవ్ యూ సో మచ్’
..ఆమె మనసు తెరుచుకుంది.
అతని శవపేటిక మూసుకుంది.

## ఆలస్యం

## ప్రేమికుడు

‘ఆత్మహత్యకు ప్రయత్నించే
పిరికిపందలంటే నాకు అసహ్యం’.
ఏదో సందర్భంలో ఆమె అన్న మాటలే..
ఆ భగ్న ప్రేమికుడిని ఇంకా
బతికిస్తున్నాయి.





అతను
లక్ష అబద్ధాలు
చెప్పినా భరించింది.
ఆ ఒక్క అబద్ధాన్ని
మాత్రం తట్టుకోలేక
పోయింది..
‘ఐ లవ్ యూ’.

## ఐ లవ్ యూ



## సాకు

మా ఇంటికొచ్చిన
ప్రతిసారీ
అతను
ఏదో ఒకటి
వదిలి వెళ్తాడు.
మతిమరుపు కాదు.
మళ్లీ రావడానికి సాకు.



## ముద్దు

తొలిముద్దు..
క్యాంపస్ విడిచి
వెళ్తున్నప్పుడు.
బస్ కదిలింది!
చివరి ముద్దు..
శరీరం విడిచి
వెళ్తున్నప్పుడు.
అంబులెన్స్ కదిలింది!

## లైట్ తీస్కో

‘ఒక ప్రేమ విఫలమైతేనేం.
మరోసారి ప్రేమించు’
సలహా ఇవ్వబోయాడు మిత్రుడు.
‘మరోసారి మరణించడం
ఎలా కుదురుతుంది?’
సూటిగా ప్రశ్నించాడు
భగ్న ప్రేమికుడు.

## మరో టీ..



రెండో కప్పు చాయ్
అడిగాడంటే..
టీ ప్రేమికుడైనా కావాలి.
నీ ప్రేమికుడైనా కావాలి.